విద్యుత్ ఉద్యోగులకు రూ. కోటి బీమా

- రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం
- రికార్డ్ స్థాయిలో డిమాండ్ పెరిగినా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ అగ్రస్థానంలో ఉండాలి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



బ్యాంకర్లతో ఒప్పందం చేసుకుంటున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 50,868 మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమమని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాపై బ్యాంకర్లతో ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే ప్రధాన సంస్థల్లో ఒకటైన విద్యుత్ సంస్థ సిబ్బంది, కుటుంబాల కోసం ప్రమాద బీమా పథకం తీసుకురావడం తనకు వ్యక్తిగతంగా తృప్తినిచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రాణాలు అడ్డంపెట్టి విధులు నిర్వహిస్తారని కొనియాడారు. రాష్ట్ర జిడిపి పెరుగుదలకు ఈ శాఖ ఇంధనంగా ఉపయోగపడుతున్నదన్నారు.

ఉద్యోగుల హోదాలు వేరైనా వారి కుటుంబాల విషయంలో మాత్రం ఒకే రకమైన అనుబంధం, బాధ్యత ఉంటాయని గుర్తుచేశారు. ఇంటిపెద్దకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆయా కుటుంబాలు తలకిందులవుతాయనీ, అలాంటి పరిస్థితి రావద్దని ఆకాంక్షించారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలను ఆదుకునేందుకే ఈ ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టామని డిప్యూటీ సిఎం వివరించారు. ఈ పథకంలో సిబ్బంది కాంట్రాక్ట్యువల్ లేదని, దీంతో ఉద్యోగుల్లో మనోధైర్యం పెరిగి, ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా తెరిచిన ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా వివాహం, విద్యాపరమైన ఆర్థిక సహాయంలోనూ ఆ బ్యాంకు రుణాలు అందించి చేయూతనివ్వనుందని వెల్లడించారు. ప్రమాదవశాత్తు శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ. 80 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. ఈ ఖాతా తెరిచిన ఉద్యోగులు అకౌంట్‌లో జీరో బ్యాలెన్స్ ఉన్నప్పటికీ సేవలు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు, చెక్‌బుక్ సేవలపైన ఎటువంటి చార్జెస్ ఉండవని స్పష్టం చేశారు. సహజ మరణం చెందితే రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని, ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు.

గతంలో తాను జాతీయ బ్యాంకు డైరెక్టర్‌గా విధులు నిర్వహించానని భట్టి గుర్తుచేశారు. ఎడ్యుకేషన్ లోన్ ఇచ్చేందుకు నిబంధనలను సరళీకరిస్తు, అర్జున్ ప్రాపర్టీ, నెలవారీ జీతం లేకున్నా ఎడ్యుకేషన్ లోన్ ఇవ్వాలని బోర్డులో తీర్మానం పెట్టి తాను ఆమోదింప చేసినట్లు తెలిపారు. నాటి ప్రతిపాదన మూలంగా డాక్టర్ పట్టాభి కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల కోసం తెస్తున్న ప్రమాద బీమా పథకం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి తృప్తినిచ్చే కార్యక్రమం అన్నారు. 2023 తో పోలిస్తే 2025లో పీక్ డిమాండ్ 17,162 మెగావాట్లు వచ్చిందని, గతంతో పోలిస్తే 2,000 మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగిన విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం లేకుండా రాష్ట్ర విద్యుత్ సిబ్బంది చూసుకున్నారని ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.

హైదరాబాద్‌కు పెట్టుబడుల రాక

రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునర్జీవం, ఫ్యూచర్ సిటీ ఇలా రకరకాల ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభమైనట్లు భట్టి వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే వివిధ క్లస్టర్లతో ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడి కోసం అంత హైదరాబాద్‌కు తరలి వస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంచడంతోపాటు కాలుష్య రహిత గ్రీన్ ఎనర్జీని సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బంది ప్రణాళికతో పని చేస్తున్నదని వివరించారు. గత పది సంవత్సరాలు ప్రత్యేక విద్యుత్ పాలసీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వెనకబడిపోయామని వివరించారు. ఈ లోటును గుర్తించి ప్రభుత్వం ఏర్పడగానే 2025 న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చామని గుర్తుచేశారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్నదని చెప్పారు.

ఒకవైపు ఉత్పత్తి పెంచుకుంటూనే సరఫరాలో 75 శాతం లక్ష్యాన్ని చేరుకోగానే సరఫరా వ్యవస్థను అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు పోతున్నామని చెప్పారు. అందుకే అదనంగా రెండు వేల మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినప్పటికీ రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా ఈ వేసవిలో విద్యుత్ సరఫరా జరిగిందని డిప్యూటీ సిఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న మంత్రులు

26న గోల్కొండలో తొలి బోనం

- 28 దేవాలయాల్లో ఘనంగా బోనాల నిర్వహణ
- ఆషాడ బోనాల సమీక్షలో మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోల్కొండ మహంకాళికి ఈ నెల 26న తొలిబోనం సమర్పణతో ఆషాడ బోనాలు హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయనీ, 28 దేవాలయాల్లో ఘనంగా బోనాల నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాటికి సబంధించిన ఏర్పాట్లను పకడ్బంధీగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై హైదరాబాద్‌లో మంగళవారం ఎంసిఆర్‌హెచ్ ఆర్‌డిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతామని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 26న గోల్కొండ కోటలో తొలిబోనం సమర్పణ ఉంటుందనీ, ఆ తర్వాత బల్కంపేట, ఉజ్జయిని మహంకాళీ, లాల్ దర్వాజ బోనాలుంటాయని వివరించారు. దేవాలయాలకు ఇచ్చే చెక్కులను రెవెన్యూ, దేవాదాయ శాఖలు కోఆర్డినేట్ చేసుకుని పండుగలకు ముందే పూర్తిచేయాలని సూచించారు. అధికారులు ఉద్యోగం లాగా కాకుండా సేవా దృక్పథంతో పని చేయాలని కోరారు. శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ఆదేశించారు. సమీక్షలో జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డిజిపి జితేందర్, ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావు, సిపి సివి ఆనంద్, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-3 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

- గ్రూప్-2 నియామకాల పూర్తయ్యాక నిర్వహణ
- టిజిపిఎస్‌సి కార్యదర్శి నవీన్ నికోలస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే ధ్రువపత్రాల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18 నుంచి వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. కొందరు అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గ్రూప్-2 నియామకాల ప్రక్రియ పూర్తయ్యాక గ్రూప్-3 ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలకుండా ఉండొద్దనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇతర వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గతనెల 29 నుంచి ఈ నెల పదో తేదీ వరకు గ్రూప్-2 అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగిన విషయం తెలిసిందే. గతనెల 27 నుంచి ఈనెల 11 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టిజిపిఎస్‌సి విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టిఎస్‌పిఎస్‌సి 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి విదితమే.

30 శాతానికి పెరిగిన చిరుధాన్యాల వాడకం

- సిఐఎస్ఎఫ్ డిఐజి అజయ్ దహియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవడం 30 శాతానికి పెరిగిందని సిఐఎస్ఎఫ్ డిఐజి అజయ్ దహియా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర హోం మంతిత్వశాఖ 'శ్రీ అన్న' పేరుతో ఇచ్చిన కార్యక్రమాన్ని సిఐఎస్ఎఫ్ విజయవంతంగా అమలు చేసిందన్నారు. 434 యూనిట్ల ద్వారా దీనిని చేపట్టినట్టు వివరించారు. 2023లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీ అన్న కార్యక్రమానికి అదే ఏడాది మే 4న శ్రీకారం చుట్టారు. 2024-25 నాటికి వీటి వాడకం 30 శాతాని చేరుకునే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. చిరుధాన్యాల ఉపయోగాన్ని వివరించే సాహిత్యాన్ని తెచ్చారు. 1,110 సెమినార్లు, వెబినార్లు, వర్క్‌షాప్‌లను, 662 లెక్చర్లను ఆహార నిపుణులు, వైద్యుల ద్వారా నిర్వహించి అపోహలను తొలగించారు. 335 మిల్లెట్ మేళా ప్రదర్శన ద్వారా ప్రజలకు, సీఐఎస్ఎఫ్ కుటుంబాలకు అవగాహన కల్పించారు. కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ భండార్ అవుట్ లెట్లలో చిరుధాన్యాలను అందుబాటులో ఉంచారు. మొదటి పంటగా, భవిష్యత్ పంటగా చేసిన ప్రచారం ఫలితమిచ్చిందనీ, అనుకున్న లక్ష్యం మేరకు ఆహారంలో 30 శాతం చిరు ధాన్యాలుంటున్నాయని అజయ్ దహియా సంతోషం వ్యక్తం చేశారు.

బస్‌పాస్ చార్జీల పెంపును ఉపసంహరించాలి

- ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పది లక్షలకుపైగా పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణం చేస్తారని తెలిపారు. ఈ చార్జీల పెంపు ద్వారా వారిపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇప్పటికే ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను పెరిగిన ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్టిసిలో విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులను ఇవ్వాలని కోరారు.

నేడు కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం కమిషన్ విచారణకు మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నేడు హాజరు కానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన పిసి ఘోష్ కమిషన్ విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్ విచారణ హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరగనున్నది. కాగా కెసిఆర్ బుధవారం ఉదయం 11.30 గంటలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ విచారణకు హాజరు కానున్నారు. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ విచారణకు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావు హాజరైన సంగతి తెలిసిందే.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 3,105 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం సైన్స్ పార్ట్-2 (బయలాజికల్ సైన్స్) పరీక్షను నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. సైన్స్ పార్ట్-2 పరీక్షకు 20,343 మంది దరఖాస్తు చేయగా, 17,238 (84.74 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 3,105 (15.26 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేస్తాం

- మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మార్కెట్ యార్డు లేకపోవడంతో రైతులు మొక్కజొన్న, పత్తితోపాటు ఇతర పంటలు అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి వెల్లడించారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి : ఎఐడిఎస్‌వో

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బస్‌పాస్ చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐడీఎస్‌వో రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్‌రాజ్, కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరారు. విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం వైఖరి నశించాలని తెలిపారు. విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

తొలగించిన 26 కులాలపై బిసి కమిషన్ విచారణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బిసి కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవాలంటూ వచ్చిన విజ్ఞప్తులపై బిసి కమిషన్‌లో రెండో రోజు బహిరంగ విచారణ జరిగింది. బిసి కమిషన్ చైర్మెన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యూ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి జి సతీష్‌కుమార్, రీసెర్చ్ అఫీసర్ జి లక్ష్మినారాయణ పాల్గొన్నారు. గవర, తూర్పుకాపు (గాజులకాపు), శెట్టిబలిజ, నాగవంశం, కొప్పుల వెలమ సంఘాల వారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు

పహల్గాం దాడిని నివారించడంలో కేంద్రం వైఫల్యం

- ట్రంప్ జోక్యం సరికాదు
- కాల్పుల విరమణ ఒప్పందంలోని అంశాలు వెల్లడించాలి : తమ్మినేని

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పహల్గాంపై ఉగ్రదాడి జరుగుతుందని ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ముందే తెలిసినప్పటికీ నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, ఆ దాడిలో 26 మంది మరణించడం బాధాకరమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటును సమావేశపరిచి పహల్గాం యాత్రికులపై దాడి అనంతరం పాకిస్థాన్ యుద్ధ పరిస్థితుల గురించి వివరాలను దేశ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పాకిస్థాన్‌తో జరిగిన పోరాటంలో నష్టపోయిన యుద్ధ విమానాల గురించి తెలియజేయాలన్నారు. కాల్పుల విరమణ ఒప్పందంలోని అంశాలు ఏమిటో ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాల్పుల విరమణకు ఒప్పించినట్టు అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టంగా స్పందించలేదన్నారు. ఇండియా, పాకిస్థాన్ సమస్యలో ట్రంప్ జోక్యం ఎందుకో కేంద్ర ప్రభుత్వం తెలియజేయలేదని, దాన్ని నేటికీ ఖండించలేదని అన్నారు. భారత్ ద్వైపాక్షిక విషయంలో ట్రంప్ జోక్యం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం దేశంలో మత ఘర్షణలను పెంచి ముస్లిములను రెచ్చగొడుతోందన్నారు. దేశంలో మీడియా కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉందని, ముఖ్యమైన ఛానల్స్ వాస్తవాన్ని కాకుండా గ్లోబల్ ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శత్రుత్వం ఇండియా పాకిస్థాన్ దేశాల మధ్యనే తప్ప ప్రజల మధ్య కాదన్నారు. నదీ జలాలను ఆపినట్లైతే ఆ దేశంలోని రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు.

రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమైందన్నారు. రైతుబంధు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్లు, మహిళలకు పెన్షన్లు వంటి హామీలు ఏవీ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కెసిఆర్, కెటిఆర్‌లపై విమర్శలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినప్పటికీ అవి లబ్దిదారులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎక్కువగా వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా.. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ అరెస్టు అయ్యేది సిపిఎం నాయకులే అని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, పోలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగవరపు పాండు, ములకలపల్లి రాములు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్ రెడ్డి, దుగ్గి బ్రహ్మం, భూక్యా పాండు నాయక్, షేక్ యాకూబ్, సైదులు, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, రేపాకుల మురళి, మాలోత్ బాలు నాయక్ ఉన్నారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్ వీరయ్య

గందరగోళం సృష్టిస్తున్న ముఖ్యమంత్రి

- ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కితే ఊరుకోం..
- బిజెపి మతోన్మాదంపై అలుపెరుగని పోరు : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర ఆవిష్కరణలో తాను బిజెపి స్కూల్లో చదువుకున్నానని, టిడిపిలో కళాశాల పూర్తి చేసుకుని కాంగ్రెసోలో ఉద్యోగం చేస్తున్నానని మాట్లాడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గందరగోళ పరిస్థితిని సృష్టిస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఎటు నడిపించాలనుకుంటున్నారో, సమస్యలను ఏం చేయాలనుకుంటున్నారో సిఎం సమాధానం చెప్పాలన్నారు. ఇండియా కూటమి కట్టి పోరాటం చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఇలాంటి మాటలు ఆదర్శంగా చెప్పాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఇది బాధ్యత అనిపించుకోదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తుందని నమ్ముతున్నారా ? అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కలిసి బొగ్గు గనులు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా కంపెనీలు పెడితే తాము సహకరిస్తామని, కానీ ప్రభుత్వం పర్యావరణాన్ని దెబ్బతీసే కంపెనీలకు అనుమతులు ఇస్తోందని అన్నారు. రాష్ట్ర రాజకీయాలను మొత్తం కాళేశ్వరం చుట్టూ తిప్పుతున్నారని, ఆరోపణలు ప్రత్యారోపణలు మానుకొని విచారణ చేసి దోషులను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. యాదాద్రి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. మూసీ ప్రక్షాళన చేపట్టాల్సిందేనని.. ప్రక్షాళన పేరుతో మూసీ భూములతో రియల్ ఎస్టేట్ వారు వ్యాపారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఏడాదిన్నర పూర్తయినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గద్వాల్ వెళుతున్న సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరు మల్లేశం, మాటూరు బాలరాజు, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బబ్బురి పోశెట్టి, పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి

- మంత్రి దామోదర రాజనర్సింహకు జూడాల వినతి

మంత్రి దామోదరకు వినతిపత్రం అందజేస్తున్న జూడా నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజూడా) కోరింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను టీజూడా అధ్యక్షులు డాక్టర్ ఐజాక్ న్యూటన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్ గౌడ్ దుర్గం, ఉపాధ్యక్షులు డాక్టర్ గిరి ప్రసాద్, డాక్టర్ దీపాంకర్, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రవీణ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఒక్కో సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటాని తెలిపారు. అంతకు ముందు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టిజూడా ప్రతినిధులతో వచ్చే శనివారం సమావేశమై ఆయా సమస్యలపై చర్చిస్తానని మంత్రి తెలిపారు. తమ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రికి జూడా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పూర్తి చేయాలి

- ఆయిల్‌ఫెడ్ సమీక్షలో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేట జిల్లాలో నిర్మితమవుతున్న నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జూలై నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆయిల్ ఫెడ్ సంస్థ ఆర్థికంగా బలోపేతమవుతూనే రైతులకు లాభాలను అందించే విధంగా పని చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్‌లో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ఆయిల్ ఫెడ్‌పై ఆయన సమీక్షించారు. ఆయిల్ ఫామ్ నర్సరీల పర్యవేక్షణ నిరంతరం చేయాలన్నారు. నాణ్యమైన మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అంతర పంటల విషయంలో రైతులకు సరైన అవగాహన కల్పించాలని కోరారు. అందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని చెప్పారు. ఐదు లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆయిల్ ఫెడ్ ఎండీ ప్రశాంత్ కుమార్, ఓఎస్‌డీ కిరణ్ కుమార్, జనరల్ మేనేజన్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజన్ సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో బోగస్ విద్యాసంస్థలు

- ఎఐసిటిఇ అనుమతి ఉందా?
- ఏ విశ్వవిద్యాలయం గుర్తింపుతో ప్రవేశాలు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యలో బోగస్ విద్యాసంస్థలున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల ఫిర్యాదుల ఆధారంగా వాటికి ఈనెల మూడో తేదీన నోటీసులను జారీ చేశామన్నారు. ఎఐసిటిఇ అనుమతి ఉందా?, ఏ విశ్వవిద్యాలయం గుర్తింపుతో ప్రవేశాలు చేపడుతున్నారు వంటి ప్రశ్నలకు వివరణ ఇవ్వాలంటూ ఆదేశించామని అన్నారు. ఈ నెల 13 వరకు వివరణ ఇచ్చేందుకు గడువు ఉందని వివరించారు. ఆ తర్వాత వివరణను బట్టి చర్యలు తీసుకుంటామనీ, ప్రభుత్వానికి, ఏఐసీటీఈకి నివేదిస్తామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన నాలుగు బోగస్ ఇంజినీరింగ్ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయని అన్నారు. నానక్‌రాం గూడలో నెక్స్ట్‌వేవ్, లీప్‌స్టార్ట్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, మాదాపూర్‌లో బైటెక్స్‌ఎల్ టెక్ ఎడ్ ప్రయివేటు లిమిటెడ్, హైటెక్‌సిటీలో ఇంటెల్లిపాట్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. మల్లారెడ్డి, అరోరా, చైతన్య ప్రయివేటు విశ్వవిద్యాలయాల గుర్తింపు ఉందనీ, వాటితో ఎంవోయూ కుదుర్చుకుని తరగతులను బోధిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో బోగస్ విద్యాసంస్థలను అరికడతామన్నారు. వాటి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. వాటిలో చేరి చాలా మంది విద్యార్థులు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐసిటిఇ అనుమతి ఉందా?, విశ్వవిద్యాలయం గుర్తింపు ఉందా? వంటి విషయాలను తెలుసుకోవాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. ఆ నాలుగు సంస్థల వివరణ ఆధారంగా తదుపరి చర్యలుంటాయని వివరించారు. వివరణ ఇవ్వకుంటే ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు.

ఇంజనీరింగ్ ఫీజు ఖరారుపై కసరత్తు

ఇంజనీరింగ్ ఫీజుల ఖరారుపై కసరత్తు జరుగుతున్నదని బాలకిష్టారెడ్డి అన్నారు. టిఎఎఫ్ఆర్‌సి ఇప్పటికే ఫీజు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. వాటిని ప్రభుత్వం సమీక్షిస్తున్నదని వివరించారు. కొన్ని కాలేజీలకు ఎక్కువ ఫీజు పెరగడంపై అభ్యంతరాలొచ్చాయని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. జులై మొదటివారంలో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అన్నారు. ఆగస్టు 14 నుంచి ఇంజినీరింగ్ తరగతులను ప్రారంభించాలంటూ ఎఐసిటిఇ ఆదేశించిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి జోసా తరహాలో మాక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు వెబ్ఆప్షన్ల నమోదుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీట్ల కేటాయింపుతో పాటు ఏ బ్రాంచీలో, ఏ కాలేజీలో సీట్లు వస్తుంది వంటి అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఇంజనీరింగ్‌లో కోర్ బ్రాంచీలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఏ బ్రాంచీలో చేరాలి, ఏ కోర్సుకు భవిష్యత్తు ఉంటుంది వంటి అంశాలపై ఈనెల 16 నుంచి 21వ తేదీమధ్యలో జేఎన్టీయూహెచ్‌లో ఒకరోజు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. మెకానికల్, సివిల్ వంటి కోర్సుల్లో చేరితే కలిగే ప్రయోజనాలను వివరిస్తామని చెప్పారు. విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కోసం త్వరలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లు తేవాలంటూ సిఎం రేవంత్‌రెడ్డిని కోరామని గుర్తు చేశారు. ఉన్నత విద్యామండలికి కొన్ని అధికారాలు కావాల్సి ఉందన్నారు. బోగస్ విద్యాసంస్థల గురించి సిఎంకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో 400 నుంచి 500 వరకు ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటి భర్తీ కోసం చర్యలు చేపడతామని అన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S No 20/2024
ఉద్దీస ధనరాజు S/o సుబ్బారావు 40 సం.లు D.no : 1-194, పెదమడి,ఐ.పోలవరం మండలం, డా.బి.ఆర్.ఎ.కోనసీమ జిల్లా.
... వాది
మరియు
కావూరి సాగర్ S/o వాడపల్లి, 44 సం.లు, వ్యాపారం D.no: 5-27-72,ఎస్. సి. బి. నగర్, కుతుబుల్లాపూర్, జీడిమెట్ల, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.
... ప్రతివాది
పై నెంబర్ దావాలో ప్రతి వాది కోర్టు నుండి ఎన్ని నోటీసులు పంపించిననూ తీసుకొనుటలేదు. కావున మహారాజశ్రీ కోర్టు వారు ది. 27-06-2025 తేదీన ఉదయం 10:30 నిమిషములకు కోర్టు ఎదుట స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని ప్రతివాది హాజరు కావలెనని లేని ఎడల పరోక్షమున దావా తీర్మానించబడునని ఈ నోటీసు ద్వారా తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వై వి ఎస్ ఎన్ ప్రసాద్
అడ్వకేట్
అమలాపురం
అమలాపురం
తేది: 8. 6. 2025

క్రిస్టల్ నుంచి రెండు కలుపు మందులు

హైదరాబాద్ : వ్యవసాయ రసాయన ఉత్పత్తుల కంపెనీ క్రిస్టల్ క్రాప్ కొత్తగా రెండు కలుపు మందులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. వరి సాగు కోసం రైస్‌యాక్ట్, పత్తి కోసం తదుపరి తరం పురుగుమందు జివోరాను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఇవి పురుగు మందుల అమ్మకాల్లో తమ పోర్టుపోలియోను ఎనిమిది శాతానికి పెంచనున్నాయని ఆ సంస్థ అంచనా వేసింది. ఇవి 45 గ్రాముల నుంచి ఒక కిలో ప్యాక్‌లో లభిస్తాయని తెలిపింది. జివోరా పత్తి రైతులకు బహుళ తెగులు దశలలో పని చేస్తుందని క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ప్రతినిధి సోహిత్ సత్యవాలి పేర్కొన్నారు.

వీటీ మార్కెట్స్‌లో ఫ్రాడ్ సిస్టమ్ అప్‌గ్రేడ్

హైదరాబాద్ : మల్టీ ఆసెట్ బ్రోకరేజ్ సంస్థ 'వీటీ మార్కెట్స్' రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో మరో అప్‌గ్రేడేషన్‌ను ప్రకటించింది. ఇందులో ఇంటెలిజెంట్ ఆటోమేషన్, అధునాతన రియల్‌టైమ్ మానిటరింగ్ టెక్నాలజీతో కూడిన యాంటీ ఫ్రాడ్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఇది తొమ్మిది అధునాతన డిటెక్షన్ రూల్స్ ఉపయోగించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించగలదని, మోసాన్ని ముందుగానే పసిగడుతుందని తెలిపింది. ఆటోమేషన్, అధునాతన మానిటరింగ్ టూల్స్ ద్వారా కస్టమర్ల ఆస్తులను రక్షించగలుగుతుందని పేర్కొంది.

టిపిసిసి కార్యవర్గంలో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పార్టీ కోసం పని చేసిన వారికి, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కార్యవర్గంలో అధిక ప్రాధాన్యత ఇచ్చిందని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌-లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇతర పార్టీల కంటే కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కార్యవర్గంలో యువ న్యాయకత్వానికి కీలక బాధ్యతలు ఇచ్చిందన్నారు. మహిళలు, మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆ వర్గాలకు సముచిత స్థానం దక్కిందని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచన, మహేష్‌కుమార్ గౌడ్ సమిష్టి నిర్ణయాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచానికి ఎర్రజెండే దిక్సూచి

- పేదలు, కార్మికుల పక్షాన నిలబడి కొట్లాడుతుంది
- రఘుపాల్ సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే రోజుల్లో ప్రపంచానికి ఎర్రజెండే దిక్సూచిగా మారనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, సిపిఎం హైదరాబాద్ జంట నగరాల మాజీ కార్యదర్శి, సిఐటియు నేత గంగసాని రఘుపాల్ సంస్మరణ సభ మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రఘుపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రఘుపాల్‌పై సాంబరాజు యాదగిరి రాసిన పాటల సీడీని జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు సూడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, అతని కుమారుడు డాక్టర్ గోపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. నిత్య కమ్యూనిస్టు యోధుడు రఘుపాల్ ఒక వ్యక్తి కాదని.. కమ్యూనిస్టు శక్తి అని కొనియాడారు. ధనిక కుటుంబంలో జన్మించిన రఘుపాల్ ఆస్తిపాస్తులను వదిలిపెట్టి ఎర్రజెండాను చేతపట్టారని తెలిపారు. ఆయన జీవితమంతా నిస్వార్థంగా ప్రజల పక్షాన పోరాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్టు చెప్పారు. జనగామ ప్రాంతంలో జరిగిన ప్రజా ఉద్యమాల్లో ముఖ్యమైన పాత్ర పోషించడమే కాకుండా హైదరాబాద్ నగరానికి సుమారు రెండు దశాబ్దాల పాటు కార్యదర్శిగా పని చేసి పార్టీని నిర్మించారన్నారు. పార్టీ పత్రిక అయిన ప్రజాశక్తి అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించారని అన్నారు. నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం చివరిదాకా పోరాటం చేసిన రఘుపాల్.. ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే అసలైన నివాళి అని తెలిపారు.

సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

కమ్యూనిస్టు పోరాటాలకు మద్దతిస్తాం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రఘుపాల్‌తో విద్యార్థి దశలో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పటిమను పుణికి పుచ్చుకున్న దొడ్డి కొమురయ్య, ఐలమ్మల వారసత్వంగా ఉన్న జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన రఘుపాల్ కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ఎంతోమందికి సేవలు అందించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాకు గులాబీ జెండా అండగా ఉంటుందన్నారు.

కమ్యూనిజమే ఊపిరిగా బతికాడు : రఘుపాల్ తనయుడు గోపాల్‌రెడ్డి

తన తండ్రి గంగసాని రఘుపాల్ రెడ్డి కమ్యూనిజమే ఊపిరిగా బతికారని ఆయన కుమారుడు గంగసాని గోపాల్ రెడ్డి అన్నారు. తన తండ్రి భౌతికకాయాన్ని ఆయన కోరిక మేరకు మెడికల్ విద్యార్థులకు అప్పజెప్పడం సంతోషంగా ఉందన్నారు. తన తండ్రి ఆశయాల సాధన కోసం తమ వంతు కృషి చేస్తానన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తిరాజు, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, చందునాయక్, బెల్లంకొండ వెంకటేష్, పుత్కనూరు ఉపేందర్, బి గణేష్, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, మునిగల రమేష్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, రఘపాల్ కుటుంబ సభ్యులు డాక్టర్ గోపాల్ రెడ్డి, లక్ష్మి, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు కార్యాచరణ

- సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపి అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాజ్యాంగ రక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, పార్టీ నేత అత్రం సుగుణతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆందోళనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏఐసీసీ రాష్ట్రానికి కమిటీని నియమించిందని గుర్తు చేశారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ లక్ష్యాలు, ఉద్దేశాలను బలంగా జనంలోకి తీసుకెళతామని తెలిపారు. తుది కార్యాచరణపై కమిటీలో చర్చించినట్టు వెల్లడించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారి గొంతు నొక్కుతుందని విమర్శించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి ఇందిరాపార్కు ధర్నాచౌక్‌ను పునరుద్ధరించినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో రాజ్యాంగ మనుగడ కష్టంగా మారుతోందన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాంగ విలువలు తెలియజేసేందుకు కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పేరుతో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఆత్రం సుగుణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుతో పార్లమెంట్‌లో కూర్చున్న అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

బస్ పాస్‌ల ఛార్జీల పెంపు దారుణం

- బిఆర్ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బస్ పాసుల ఛార్జీలను పెంచడం దారుణమని బిఆర్ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుమారు పదిహేను లక్షల మందిపై ఈ భారం పడే ఆవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతి విద్యార్థిపై నెలకు రూ.350 అదనపు భారాన్ని, ఆ చొప్పున ఏడాదికి రూ.650 కోట్ల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోపుతోందని విమర్శించారు. విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారిపై భారం మోపడమేంటని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్ అంటూనే వారి కుటుంబ సభ్యులపై ఛార్జీల భారం మోపడం తగదన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో బిఆర్ఎస్‌వి ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్, నాయకులు నర్సింగ్, జంగయ్య, నితీష్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- నిద్రిస్తున్న తల్లీకొడుకుపై కత్తులతో దుండగుల దాడి
- తల్లి మృతి.. కొడుకు పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళ దారుణ హత్యకు గురైన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోలు గ్రామంలో మంగళవారం జరిగింది. నిద్రిస్తున్న తల్లీకొడుకుపై దుండుగులు కత్తులతో దాడి చేయడంతో తల్లి మృతి చెందారు. కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాపోలు గ్రామానికి చెందిన గండు నర్సమ్మ (60), గండు రాజేందర్ తల్లీకొడుకులు. సోమవారం అర్ధరాత్రి వారు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పలువురు దుండగులు రాజేందర్‌పై కత్తులతో దాడి చేశారు. కొడుకుపై దాడిని అడ్డుకోబోయిన నర్సమ్మపైనా దాడి చేశారు. ఈ దాడిలో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. రాజేందర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయన్ను పరిగి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. తన మామ.. ఆయన తమ్ముడి కొడుకు రామ్‌చరణ్‌తో తమపై దాడి చేయించాడని బాధితుడు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

త్వరలో హైదరాబాద్‌లో డ్రోన్లతో డెలివరీ

- ఎంఎస్ఎంఇ వ్యాపారులకు షిప్‌రాకెట్ మద్దతు

పజాశక్తి - హైదరాబాద్

చిన్న వ్యాపార సంస్థలు (ఎంఎస్ఎంఇ) తమ ఉత్పత్తులను సొంతంగా ఆన్‌లైన్‌లో విక్రయించి, వినియోగదారులకు డెలివరీ చేసేందుకు అవసరమైన సాంకేతికత అందిస్తున్నామని ఇ-కామర్స్ ఎనేబుల్ వేదిక షిప్‌రాకెట్ సిఇఒ అతుల్ మెహతా తెలిపారు. ఎంఎస్ఎంఇ వ్యాపారాలకు మరింత మద్దతును అందించడానికి వీలుగా త్వరలో హైదరాబాద్‌లో డ్రోన్ డెలివరీ సేవలను ప్రారంభించనున్నామన్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 18,000 మంది సహా దేశవ్యాప్తంగా మూడు లక్షలకు పైగా ఎంఎస్ఎంఇలకు సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ఎంఎస్ఎంఇ వర్తకులకి అవసరమైన సాధనాలు, సాంకేతికతను సమకూర్చడంపై అవగాహన పెంచుతున్నామన్నారు. 2024-25లో తెలుగు రాష్ట్రాల నుంచి షిప్‌మెంట్ల పరిమాణం వార్షిక ప్రాతిపదికన 25 శాతం వృద్ధితో 35 లక్షల పైగా షిప్‌మెంట్ల స్థాయికి చేరిందన్నారు.

గౌలిదొడ్డి, అలుగునూరు విద్యార్థుల తరలింపును ఉపసంహరించుకోవాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తికమక నిర్ణయాలతో విద్యార్థులను గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి తిప్పలు పెడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 90 శాతానికిపైగా మార్కులు రాని గౌలిదొడ్డి, అలుగునూరు గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఇతర కాలేజీలకు తరలించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని విద్యార్థుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడాలని కోరారు.

బస్ పాస్ ధరల పెంపుతో ప్రజలపై భారం

- పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకర్లతో మాట్లాడుతున్న కవిత

రాష్ట్రంలో ఆర్‌టిసి బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండ మోపారని, పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి బస్‌పాస్ ధరల పెంపునకు నిరసనగా మంగళవారం ఆమె జాగృతి కార్యకర్తలతో కలిసి బస్ భవన్ ముట్టడికి యత్నించారు. అక్కడ మోహరించిన పోలీసులు కవితను అరెస్టు చేసి చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపుతో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ.300 పైగా భారం పడుతుందని తెలిపారు.

అనేక రూట్లల్లో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటుపడిందని విమర్శించారు. పెంచిన బస్ పాస్ ధరలను తగ్గించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన నాగమ్మ(48) పిడుగుపాటుకు బలైంది. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె లక్ష్మీపూర్‌లో జరిగిన మేనత్త కర్మకాండకు వెళ్లింది. సాయంత్రం తిరిగి గ్రామానికి బయలుదేరారు.

అదే సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో లక్ష్మీపూర్ బస్టాండ్‌లో ఆగారు. వారి సమీపంలో పిడుగుపడటంతో నాగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది.

భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా దుర్మార్గ విధానం వీడాలి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చదువు కోసం, కొలువు, ఉపాధి కోసం అమెరికా వెళ్లిన వారి పట్ల ఆ దేశ ఇమ్మిగ్రేషన్ అధికారులు అమానుషంగా వ్యవహరించడాన్ని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా ఖండించారు. భారతీయ విద్యార్థులు, వలసదారుల పట్ల అమెరికా దుర్మార్గ విధానం వీడాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చేతులు వెనక్కు విరిచికట్టి తొక్కిపెట్టి బలవంతంగా పశువుల మాదిరిగా పంపడాన్ని అమానుష చర్య అని తెలిపారు. కోటి ఆశలతో పొట్ట చేతపట్టుకుని అక్కడికి వెళ్లిన వారు ఏజెంట్స్ చేసే తప్పులకు బలవుతున్నారని పేర్కొన్నారు. హర్యానాకు చెందిన వలస విద్యార్థి పట్ల అమెరికాలోని న్యూజెర్సీ నీవడా విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారుల దాష్టీకం భారతీయులందరికీ అవమానకరమని తెలిపారు. మోడీ కనీసం నిరసన తెలియజేయకపోవడం అన్యాయమని విమర్శించారు. ప్రజలు, దేశ గౌరవం కంటే ట్రంప్‌తో మిత్రబంధం ఎక్కువన్నట్టు మోడీ చూడటం దేశ సార్వభౌమాధికారానికే తీరని కళంకం అని తెలిపారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ఈ అమానుషత్వంపై నోరు విప్పి నిరసన ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుల, మతాల మధ్య బిజెపి చిచ్చు

- 11 ఏళ్లుగా మోడీ దేశానికి చేసింది శూన్యమే
- పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచారు
- టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారం కోసం ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా.. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. వారి కుట్రలను తిప్పి కొట్టేందుకు కాంగ్రెస్ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని గ్రామ గ్రామానా నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో మంగళవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధానం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. పట్టణ ముఖ్య కూడలిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు లేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బిజెపి, ఆర్ఎస్ఎస్.. మత రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ ప్రపంచం గౌరవించే మన రాజ్యాంగాన్ని మార్చి మతతత్వ రాజ్యాంగాన్ని రచించేందుకు బిజెపి కుట్రలు చేస్తోందన్నారు. 400 సీట్లంటూ ఎగిసిపడ్డ బిజెపికి గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. 11 ఏళ్ల ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ దేశానికి చేసిందేమీ లేదన్నారు. సామాన్య ప్రజల జేబులను ధరలు పెంచి కొల్లగట్టారని తెలిపారు. మూడు శాతం ఉన్న ధనికుల వద్ద 40 శాతం దేశ సంపద ఉందని, 50 శాతానికి పైగా ఉన్న సామాన్య ప్రజల వద్ద మూడు శాతం సంపద ఉండటం చూస్తుంటే నరేంద్ర మోడీ పాలన ఏంటో తెలుస్తుందన్నారు. నల్లధనం, 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్‌పై యుద్ధం అంటూ ఎగిసిపడ్డ మోడీ.. అమెరికా అధ్యక్షులు ట్రంప్ వద్దని చెప్పడంతో తోకముడిచారని అన్నారు. దేశ భద్రత కోసం సైనికులు ప్రాణాలర్పిస్తుంటే నరేంద్ర మోడీ ట్రంప్ డైరెక్షన్‌లో నడుస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బిజెపి కుట్రలను ప్రతి గడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని సూచించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని, ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ క్రమశిక్షణ గల నాయకుడని, రేవంత్‌రెడ్డికి తనకు ఎంతో ఆప్తుడని, అతనికి మంచి భవిష్యత్తు ఉందని కొనియాడారు. గుజరాతీ ఆర్థిక నేరగాళ్లకు బిజెపి దేశ సంపదను దోచిపెడుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేష్ కుమార్ గౌడ్

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

- ప్రజా, కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలంటూ జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు ఫెడరేషన్, అసోసియేషన్‌లు మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హెచ్ఎంఎస్ నాయకులు అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 11 ఏళ్లుగా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేసిందన్నారు. జిల్లా సమావేశాలు, సమ్మె నోటీసులు, గేట్ మీటింగ్స్, గ్రూప్ మీటింగ్స్, జనరల్ బాడీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో సభలు, సెక్టోరల్ సదస్సులు, బైక్ ర్యాలీలు, కరపత్ర ప్రచారం, పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం తదితర రూపాల్లో కార్మికవర్గాన్ని చైతన్యపరిచి, కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై గట్టి ప్రతిఘటన ఇవ్వాలని కోరారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నదన్నారు. ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు కార్మికవర్గం పోరాటానికి సన్నద్ధం కావాలని సూచించారు. టియుసిఐ నాయకులు సూర్యం మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల పేదరికం 17 శాతానికి పెరిగిందని, పేదల జీవితాలను కష్టాలపాలు చేస్తున్న మోడీ సర్కార్ విధానాలను కార్మికవర్గం ప్రతిఘటించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

శివబాబు (ఐఎఫ్‌టియు), పి వెంకట్రామయ్య (బ్యాంకింగ్), జి.తిరుపతయ్య (ఇన్సూరెన్స్), రాజు భట్ (మెడికల్ రిప్స్), జె వెంకటేష్, కుమారస్వామి (సిఐటియు), అంజాద్ (హెచ్ఎంఎస్) తదితరులు కార్యాచరణను బలపరుస్తూ వందన సమర్పణం చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై సోమన్న, ఎఐటియుసి నాయకులు నరసింహ, కిషన్, ఎంకె బోస్ (టిఎన్‌టియుసి), భరత్ (ఎఐటియుసి), పి వెంకట్రామయ్య (బెఫి) పాల్గొన్నారు.

త్వరలో ఏజెన్సీల్లో జాబ్‌మేళాలు

- ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేల సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొమ్రం భీం కన్జర్వేషన్ టైగర్ రిజర్వు రద్దు చేయాలని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలు చేసిన విన్నపాన్ని సిఎం, కేబినెట్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) హామీనిచ్చారు. త్వరలో ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక జాబ్‌మేళాలు నిర్వహిస్తామని ప్రకటించారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో గిరిజన, ఆదివాసీ ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్‌ను మంత్రి సీతక్క, ఎస్‌టి ఎమ్మెల్యేలు సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మీ, అనిల్ జాదవ్, ఆదినారాయణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక్ తిరుపతి, ట్రైబల్ కార్యదర్శి శరత్, ఎస్‌టి గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మీ, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రూ.1,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం, రూ.12,600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికాసం, రూ.17,168 కోట్లతో ఎస్‌టి ఎస్‌డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమ్రంభీం కన్జర్వేషన్ టైగర్ రిజర్వుగా ప్రకటిస్తూ తెచ్చిన జీవో నెం.49ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గ్రామసభ అనుమతి లేకుండా గిరిజన గ్రామల్లో, పొలాల్లో అటవీశాఖ అధికారులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి సీతక్క దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకొచ్చారు. పెసా చట్టాలను ఉల్లంఘిస్తూ అటవీ అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుబట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గిరిజన ఆహారశాలను ప్రారంభించిన మంత్రి సీతక్క

సంక్షేమభవన్ ప్రాంగణంలో గిరిజన ఆహారశాలను, దేవాలయాలను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. అటవీ ఉత్పత్తులతో తయారు చేసిన 20 రకాల వంటకాలు, చిరుతిళ్ల స్టాళ్లను సందర్శించారు. గిరిజన ఆహారం పేరుతో స్టాల్ కూర్చొని తినేందుకు గుడిసె థీమ్ తో చెక్క టేబుల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. పలు వంటకాల రుచి చూశారు. గిరిజన దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం ఆడిటోరియంలో కొమ్రంభీం డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలతో కలిసి వీక్షించారు.